Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

APTEL:2024/86143 జాతీయ తెలుగు దినపత్రిక

Associate Editor : K L Krishnam Raju | Volume : 6 | issue: 190 | Monday : 07.07.2025 | Price : 3/- | Pages : 4

అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణం రాజు | సంపుటి : 6 | సంచిక :190 | సోమవారం 7 జూలై 2025 | వెల : 3 | పేజీలు : 4

WANTED

స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి. అనుభవం,అర్హతను బట్టి ప్రాధాన్యత ఇవ్వబడును

సంప్రదించండి సెల్ : 9440815774




# సాదాబైనామా కొలిక్కి వచ్చేనా?

- సాదాబైనామాల కోసం 8.9 లక్షల దరఖాస్తులు
- క్రమబద్ధీకరిస్తే 20 లక్షల ఎకరాలకు పైగా పట్టాలు
- 40 శాతం దరఖాస్తులు సాదాబైనామాల క్రమబద్ధీకరణ పైనే
- భూభారతి చట్టంలో పలు సెక్షన్లు చేర్చిన ప్రభుత్వం
- కోర్టు ఆదేశాలకు అనుగుణంగా ముందుకు వెళ్లాలని రెవెన్యూ శాఖ నిర్ణయం

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, తెలంగాణ**

సాదాబైనామాల క్రమబద్ధీకరణ కోసం లక్షల మంది ఎదురుచూస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సు నిర్వహించింది. ఈ సదస్సులో భూసమస్యల పరిష్కారం కోసం 8.90 లక్షల దరఖాస్తులు అందాయి. ఇందులో 40శాతం వరకు సాదాబైనామాల క్రమబద్ధీకరణకు సంబంధించినవే ఉన్నాయి. వీటిని క్రమబద్ధీకరిస్తే 20 లక్షల ఎకరాలకు పట్టాలు రానున్నాయి. న్యాయస్థానంలో కేసు ఉండటంతో ఉత్తర్వుల కోసం రెవెన్యూశాఖ నిరీక్షిస్తోంది.

8.90 లక్షల మంది దరఖాస్తు : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 8.90 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 40 శాతం దరఖాస్తులు సాదాబైనామాల క్రమబద్ధీకరణపైనే ఉన్నాయి. కొత్త రెవెన్యూ చట్టం భూభారతిలో. క్రమబద్ధీకరణకు పలు సెక్షన్లను చేర్చడంతో బాధితులు ఆశతో ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో 2016లో తొలిసారి సాదాబైనామాల క్రమబద్ధీకరణ చేపట్టారు. 2014 జూన్‌కు ముందు జరిగిన ఒప్పందాలను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం నాడు ఉత్తర్వులు జారీ చేసింది. ఆ సంవత్సరం 11.19 లక్షల మంది అన్నదాతలు దరఖాస్తు చేయగా వారిలో 6.18 లక్షల మందిని అర్హులుగా గుర్తించి పట్టాలు పంపిణీ చేశారు. 2020లో మరోసారి ప్రభుత్వం అవకాశం కల్పించింది. కాగా ఆ సంవత్సరం అక్టోబరు 12 నుంచి 30 - మిగతా3లో



## బిహార్ గూండాల రాజ్యంగా మారిపోయింది

- నేడు బిహార్ దోపిడీ, కాల్పులు, హత్యల నీడలో నివసిస్తోంది
- రాష్ట్రంలో నేరాలు జరగడమనేది సాధారణంగా మారిపోయింది
- వీటిని నిర్మూలించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ



## రఫేల్ యుద్ధ విమానాలకు వ్యతిరేకంగా చైనా దుష్ప్రచారం..!

- ఫ్రెంచ్ ఇంటెలిజెన్స్ నివేదిక..!
- ఫ్రెంచ్ యుద్ధ విమానాల సామర్థ్యంపై సందేహాలను లేవనెత్తేందుకు ప్రయత్నిస్తోంది
- చైనా తమ యుద్ధ విమానాలు రఫేల్ కంటే మెరుగైన ప్రదర్శన చేసినట్లుగా డ్రాగన్ దేశం ప్రచారం



## హిమాచల్‌లో 75 మరణాలు..

- వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ విధింపు
- పలు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే ప్రమాదం
- హిమాచల్ ప్రదేశ్‌లో ఒక్క రోజులో 115-204 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది

# సీఎం చంద్రబాబు 10న కొత్తచెరువు పర్యటన



- రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు చేయండి
- జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్‌లి, జిల్లా ఎస్పీ వి.రత్న
- ముఖ్యమంత్రి పర్యటనపై దిశానిర్దేశం

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, పుట్టపర్తి**

శ్రీ సత్య సాయి జిల్లాలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 10వ తేదీన కొత్తచెరువులో పర్యటించే అవకాశం ఉంది. అయితే ఇంకా అధికారికంగా మినిట్ టు మినిట్ అందాల్సి ఉంది... ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు పటిష్టమైన ఏర్పాట్లను ప్రణాళికా బద్ధంగా పూర్తి చేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ అధికారులను ఆదేశించారు. ఆదివారం కొత్తచెరువు లోని శ్రీ సత్య సాయి ప్రభుత్వ జూనియర్ కాలేజి ఆవరణలో ఎస్పీ వి.రత్న, జేసి అభిషేక్ కుమార్..లతో కలసి అధికారులతో జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ సమావేశం నిర్వహించి ముఖ్యమంత్రి పర్యటనపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ..దరాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 10వ తేదీన కొత్తచెరువు జడ్పి బాలురు, బాలికల పాఠశాలలు, శ్రీ సత్య సాయి ప్రభుత్వ జూనియర్ కాలేజిలలో జరిగే మెగా పిటిఎం 2.0 కార్యక్రమంలో - మిగతా3లో



## 9న చిత్తూరు జిల్లాకు వైఎస్ జగన్.. కూటమి సర్కార్‌లో అలజడి

- చిత్తూరు జిల్లాలో మామిడి రైతులు కష్టాలు పడుతున్నారు
- రైతులను జ్యూస్ ఫ్యాక్టరీలు దోచుకుంటున్నాయి
- ఈ నెల 9న వైఎస్ జగన్ పర్యటన నేపథ్యంలో ప్రభుత్వంలో కదలిక
- జ్యూస్ ఫ్యాక్టరీలు వద్ద క్యూలైన్‌లో టోకెన్లు ఇచ్చి తక్కువ ధరకే దోచుకుంటున్నాయి
- చాలా చోట్ల 3 నుంచి 4 రూపాయలకే జ్యూస్ ఫ్యాక్టరీలు దోచుకుంటున్నాయి.

# నీళ్ల విలువ తెలియని వ్యక్తులా మన నాయకులు

- కాళేశ్వరం బటన్ నొక్కితే నీరు వచ్చే పరిస్థితి ఉన్నా ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారు?
- 'కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రతీరోజు ఏ నదిలో ఎంత నీరు ఉందో తెలుసుకునేవారు
- కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం వాటిని విస్మరిస్తోంది
- నీళ్ల విలువ తెలియని నాయకులు మనకు పాలకులుగా ఉన్నారు.
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, తెలంగాణభవన్**

నీళ్ల విలువ తెలియని నాయకులు తెలంగాణలో పాలన చేస్తున్నారని మండిపడ్డారు మాజీ మంత్రి హరీష్ రావు. కాళేశ్వరం బటన్ నొక్కితే నీరు వచ్చే పరిస్థితి ఉన్నా ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారు? అని ప్రశ్నించారు. మోటర్లు ఆన్ చేయని పక్షంలో రైతులతో కన్నెపల్లి వైపు కదులుతామని హరీష్ రావు హెచ్చరించారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ - మిగతా3లో



## రాజకీయ రంగంలోకి ఎలాన్ మస్క్

- పార్టీ గుర్తును రెండు తలల పాము మీమ్
- ది అమెరికా పార్టీ' అనే పేరుతో మూడో రాజకీయ శక్తిని ప్రకటించిన మస్క్,
- త్వరలోనే పార్టీ లోగో ప్రకటన

# రైతు భరోసా లేదు.. రైతు రుణమాఫీ లేదు

- రైతుకు బస్తా ఎరువు ఇవ్వలేని స్థితి ఎందుకుంది..
- రాష్ట్రవ్యాప్తంగా 1.94 లక్షల మెట్రిక్ టన్నుల లోటు ఎందుకుందో రైతులకు వివరించాలి
- కాంగ్రెస్ సర్కార్‌పై కేటీఆర్ ధ్వజం




**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్**

రాష్ట్రంలో ఎరువుల కొరత నేపథ్యంలో కాంగ్రెస్ సర్కార్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. రైతు భరోసా లేదు.. రైతు రుణమాఫీ లేదు.. కనీసం అప్పు తెచ్చి వ్యవసాయం చేద్దామంటే ఆఖరికి ఎరువులకు కూడా కరువొచ్చిందని అన్నారు. మీరు అడిగినట్టు ఆధార్ కార్డులు ఇచ్చినా, రైతుకి కనీసం బస్తా ఎరువు ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం - మిగతా3లో

మా ప్రతి అక్షరం - ప్రజల కోసం
చిత్తూరు ఎక్స్‌ప్రెస్
జాతీయ తెలుగు దినపత్రిక
APTEL/2024/86143



# భక్తులతో పోటెత్తిన బోయకొండ
## భక్తుల సౌకర్యాలు దగ్గరుండి పరివేక్షించిన ఈ.ఓ





**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూలై 06:** ప్రముఖ పుణ్యక్షేత్రం,భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లి బోయ కొండ గంగమ్మ దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. ఇటు ఆంధ్రప్రదేశ్ అటు కర్ణాటక, తమిళనాడు నుండి భక్తులు అధికంగా వచ్చారు,భక్తులు ఉదయం నుండి క్యూలైన్లలో అమ్మవారి మొక్కులు తీర్చుకోవడానికి బారులు తీరారు.ప్రధాన అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కార్యనిర్వాహణాధికారి, ఉపక మీషనర్ ఏకాంబరం ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఉచిత ప్రసాదాల వద్ద తోపులాటలు లేకుండా అందరూ క్యూలైన్లో వెళ్ళి ప్రసాదాలు తీసుకొనే విధముగా సిబ్బందిని ఆదేశించారు,అమ్మవారి బలి పీఠము వద్ద జంతుబలులను, అక్కడ గల సౌకర్యాలను, అలాగే తలల వేలం పాట వద్ద గల భక్తులతో చర్చించి, వేలం పాట సవ్యంగా జరుగుతున్నదా లేదా అనేవిష యాలపై, సిబ్బంది భక్తులతో మాట్లాడుతు న్న తీరుపై భక్తులను అడిగి తెలుసుకున్నారు, కళ్యాణ కట్ట వద్ద భక్తులకు తల నీలాలుసమర్పించే భక్తులు టికెట్టుద్వారానే తలనీలాలు సమర్పించాలనీ, ఎవరికీ అధనంగా పైకము చెల్లించవద్దని భక్తుల కు తెలియజేశారు, కళ్యాణ కట్టలో ఎవరైనా సిబ్బంది, చేతివాటం ప్రదర్శించినట్లు కార్యాలయం దృష్టికి వస్తే ఖచ్చితమైన చర్యలు ఉంటాయని కళ్యాణ కట్ట సిబ్బందిని హెచ్చరించడం జరిగింది. అంతే కాకుండా అనునిత్యం సమాచార కేంద్రం నుండి ఆలయప్రాంగణంలో జేబుదొంగలున్నారని, తమ విలువైన వస్తువులు జాగ్రత్తగా చూసుకోవాలని ఆయన తెలియజేశారు. ఆలయ ఉపకమేషనర్ ఈవో ఏకాంబరం ఆలయఅర్చక సిబ్బంది, భక్తులకు సేవలందించారు.

## వాడవాడల ఘనంగా మొహరం



**వి.కోట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై 06:** పలమనేరునియోజకవర్గం వీకోట మండలంలోని పలు గ్రామాలలో మొహరం (పీర్ల పండగ) భక్తిశ్రద్ధలతో హిందూ ముస్లిం మతస్థలు తారతమ్యం లేకుండా ఐకమత్యంగా కలిసి ఈ పండుగను గ్రామాలలో పేర్ల ఊరేగింపు ఉత్సవాలను ఘనంగా నిర్వహించి, అనంతరం అగ్నిగుండం నిర్వహించి డప్పుల వాయిద్యంతో భారీగా నృత్యాలు చేస్తూ ఆనందాస్తవాల మధ్య కోలాహాల ముగా నాట్యాల నిర్వహించారు. ఈ పండుగను హిందువులు ముస్లింలు ఎం తో గొప్పగా నిర్వహించి తామంతా ఒక్క టేనని మాకు ఎలాంటి భేదాభిప్రాయాలు లేదని గ్రామాలలో చాటుతున్నారు. ఈ ఉత్సవాలలో భాగంగా రాత్రి యాలకుల పంచాయతీ కళ్ళు పల్లి గ్రామంలో భారీగా నిర్వహించారు. ఈ ఉత్సవాలను చూడ డానికి చుట్టుపక్క గ్రామాలతో పాటు కల్లపల్లి గ్రామానికి చెందిన బంధు బలగాలు కూడా అత్యధిక సంఖ్యలో పాల్గొని పీర్ల పండుగ జయప్రదం చేసినారు.

## రాజమహేంద్రవరంలోని ఏపీఎస్ఆర్టీసీ డిపోని సందర్శించిన రాష్ట్ర ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూలై 06:** స్థానిక అధికారులతో కలిసి కార్మికులు, డ్రైవర్లు సమస్యల మీద స్పందించి పరిష్కారంకి కృషి చేస్తాని హామీ ఇచ్చిన అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు త్వరలో మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించడం జరుగుతుంది అని తెలియచేసారు. డిపో అభివృద్ధికి అధికారులకు సలహా సూచనలు ఇవ్వడం జరిగింది.

## గురుపౌర్ణమి సందర్భంగా కరపత్రాలు పంపిణీ కార్యక్రమం



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూలై 06:** కుప్పంమున్సిపల్ పరిధిలో గలమోడల్ కాలనీ వద్ద సాయిబాబా మందిరంలో, నిర్వహించు 10.7.2025గురు పౌర్ణమి సందర్భంగా ఆదివారం కరపత్రాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో శిరిడి సాయి ఆలయకమిటీసభ్యులు మనోహర్ సింగ్ రమేష్ కేశవ మంజు గోవింద మనోహర్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి ర్యాంకర్లను అభినందించిన ముఖ్యమంత్రి



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూలై 06:** కుప్పం ప్రభుత్వవృత్తి విద్యాకళాశాలలో మునుపెన్నడు లేని విధంగా రాష్ట్రస్థాయి ర్యాంకులను సాధించి కుప్పంప్రాంతానికి మంచి పేరు తెచ్చారని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మనరాష్ట్రంలోనే అత్యధిక మార్కులు సాధించి రాష్ట్రస్థాయి టాపర్లుగా నిలిచిన విద్యార్థులను ఉద్దేశించి కితాబు ఇచ్చారు. అదేవిధంగా మన కుప్పం విద్యార్థులు మరింత రాణించి జాతీయస్థాయిలో మన కుప్పంపేరు ప్రతిష్టలనుమరింత పెంచేందుకు కృషిచేయాలి అన్నారు. ప్రభుత్వ వృత్తి విద్యకళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న అనూష 498 /500, భవ్యశ్రీ 496 అభినయశ్రీ 495, హాసిన బాయి 495, భానుప్రియ 494 దివ్యవాణి 491 ఈశ్వర ప్రసాద్ 491మార్కులు సాధించారు. వీరినిముఖ్య మంత్రి ప్రత్యేకంగా తననివాసానికి పిలిపించి టాపర్ విద్యార్థులకు మెడల్స్ వేసి మెమెంటోలతో అభినందించారు.

## ఇంటింటి సర్వేలో తెలుగు తమ్ముళ్లు



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూలై 06:** కుప్పం పట్టణం మోడ్రన్ కాలనీ, దలవాయి కొత్తపల్లి ప్రాంతాలలో 11వ క్లస్టర్ ఇంచార్జ్ కన్నన్ ఆధ్వర్యంలో తెలుగు తమ్ముళ్లు ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గడపగడపకు వెళుతూ ప్రజల సమస్యలను విచారిస్తూ, సంవత్సర కాలంగా తెలుగుదేశం ప్రభుత్వం అందిస్తున్న పరిపాలనపై ప్రజల అభిప్రాయాలను సేకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్రంలో టిడిపి అధికారం చేపట్టి సంవత్సరకాలం పూర్తయిన సందర్భంగా సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే ఇంటింటి సర్వే నిర్వహించి, ప్రజల అభిప్రాయాలను సేకరిస్తున్నామన్నారు. ప్రభుత్వ పాలనలో ప్రజలను భాగస్వాములు చేయాలన్న ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి ఇంటింటి సర్వేకి పిలుపునిచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో 11వ క్లస్టర్ ఇన్చార్జి తిరుమగళ్, డీకేపల్లి యూనిట్ ఇంచార్జ్ నబి, బూత్ కన్వీనియర్ గనివుల్లా, కో కన్వీనర్ అంజద్, ఎస్టీ సెల్ అధ్యక్షులు నాగభూషణం, మైనారిటీ యూత్ అధ్యక్షులు అస్లాం, స్థానిక మహిళ అధ్యక్షురాలు షహనాజ్, నాయకులు సోమశేఖర్, ఫరూక్, సమీర్, ఫైరోజ్, ఆర్ముగం, షణ్ముగం నాయుడు, డీకే పల్లి మణి, ఇర్ఫాన్, ప్రకాష్, రవి, సురేష్, స్వామి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## 9న మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పర్యటనను విజయవంతం చేద్దాం



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూలై 06:** ఈనెల 9న బంగారుపాలెంలో నిర్వహించే మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పర్యటనను విజయవంతం చేద్దామని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నడింపల్లి దామోదర్ రాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక వెంకటరమణ భవనంలో మండలపార్టీ అధ్యక్షుడు నాగభూషణ్ రెడ్డి అధ్యక్షతన మండలస్థాయి నాయకులు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. బంగారుపాలెంలో మామిడి రైతులను పరామర్శిం చేందుకు వస్తున్న మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి సభను విజయవంతం చేసేందుకు అందరూ సన్నద్ధం కావాలన్నారు. రాష్ట్ర మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పుంగనూరు నియోజకవర్గం లోని చౌడేపల్లి మండలంలో నుంచి పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొని విజయ వంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మండలంలోని19పంచాయితీలకు సంబంధించిన నాయకులతో సభ విజయవంతం కోసం చర్చించారు.ఈ కార్యక్రమంలో ఇంకా మండల ఉపాధ్యక్షుడు సుధాకర్ రెడ్డి సర్పంచులు శ్రీరాం భరత్ వరుణ్ కృష్ణారెడ్డి మాజీ ఎంపీపీ రుక్మిణమ్మ మండల పార్టీ కార్యదర్శి టానాదర్ నాగరాజా ఎంపీటీసీ సభ్యుడు తొండ శ్రీరాములు నాయకులు పద్మనాభ రెడ్డి రవిచంద్ర రెడ్డి రాంబాణం శ్రీనివాసులు రంగన్న సుబ్రహ్మణ్యం మండలంలోని వైకాపా నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


## వేణుగోపాల స్వామి ఆలయంలో ఏకాదశి పూజలు



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూలై 06:** స్థానిక రుక్మిణిసత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో తొలిఏకాదశి పూజలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధానఅర్చకుడు వశిష్టాచార్యులు ఆధ్వర్యంలో ఉదయాన్నే స్వామి అమ్మ వార్లకు విశేషాలు అలంకరణ గావించారు. ఆషాడం తొలిఏకాదశిన పట్టణం నుంచి కాకుండా ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వారందరికీ పవిత్ర తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్య క్రమంలో పట్టణప్రజలు భక్తులు పాల్గొన్నారు.

## శ్రీ వీరభద్ర స్వామికి తొలి ఏకాదశి పూజలు

**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూలై 06:**



శ్రీకాళహస్తి తొట్టంబేడు మండలంలోని చిన్నసింగమాల గ్రామంలో వెలసిన శ్రీవీరభద్రస్వామికి తొలిఏకాదశి సందర్భంగా సహస్ర ఘట్టాభిషేకంచేసి ప్రత్యేక పూజలు, అలంకరణలు, నిర్వహించారు. స్వామివారికి చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులు కలశాలతో నీళ్లు తీసుకువచ్చి స్వామివారికి అభిషేకం నిర్వహించారు. స్వామివారిని అధికసంఖ్యలో భక్తులు చర్చించుకుని మోక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.రాత్రి నందిసేవ, గ్రామోత్సవం నిర్వహించారు.

### అక్రమంగా చింత చెట్ల నరికివేత పై
## పోలీసులకు ఫిర్యాదు



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై 06:** తన చింతచెట్లను అక్రమంగా నరికివేశారు అంటూ రైతు పోలీసులకు ఫిర్యాదు చేశాడు, రైతు కథనం మేరకు... మండలం లోని చారాల పంచాయతీ ఓదులపేటకు చెందిన సురేంద్ర రెడ్డికి గ్రామానికి సమీపం లోని తన సొంతస్థలంలో రెండు చింత చెట్లు ఉన్నాయని అయితే కొందరు వ్యక్తు లతో కలసి అదేగ్రామానికి చెందిన అర్జున్ రెడ్డి, తన చింతచెట్లను అక్రమంగానరికి వేశాడని రైతు వాపోయాడు ఎలాంటి చెట్లనుఅక్రమంగా నరికివేయడం తగదని రైతు తెలిపారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

## శయన ఏకాదశి సందర్భంగా భగవద్గీత పారాయణం



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూలై 06:** స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయంలో శయన ఏకాదశి సందర్భంగా భగవద్గీతలోని 18 అధ్యాయాలను సామూహిక పారాయణం చేశారు. తొలి ఏకాదశి కావడంతో వాసవి వనితకుల ఆధ్వర్యంలో మహిళలు శ్రీకృష్ణునికి విశేష పూజలు నిర్వహించారు. క్లబ్ అధ్యక్షురాలు రంగవల్లి సభ్యులు ఆర్యవైశ్య మహిళా మండల సభ్యులు పాల్గొన్నారు

## వైయస్ఆర్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా సుంకర చక్రధర్



**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూలై 06:** అన్నమయ్యజిల్లా పీలేరు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగంరాష్ట్ర అధికార ప్రతినిధిగా పీలేరుకి చెందిన సుంకర చక్రధర్ నియమితులయ్యారు.ఈ సంద ర్భంగా ఆ పార్టీ కేంద్ర కార్యాలయంనుండి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈయన గత 13 సంవత్సరాలుగా పార్టీ బలోపేతానికి కృషి చేసారు. ఈ సందర్భంగా చక్రధర్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర స్థాయిలో కీలక పదవి కట్టబెట్టిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్ర రెడ్డికి, యంపీ మిథున్ రెడ్డికి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్ర రెడ్డికి, జిల్లా అధ్యక్షులు ఆకెపాటి అమరనాథ్ రెడ్డికి, రాష్ట్ర ప్రచార విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ హరి ప్రసాద్ రెడ్డికి వైఎస్ఆర్ విద్యార్థి భాగం రాష్ట్ర అధ్యక్షులు పానుగంట చైతన్యకి ధన్యవాదాలు తెలిపారు. రానున్న ఎన్నికలలో వైయస్ జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యంగా పని చేస్తానని తెలిపారు. గ్రామస్థాయి నుండి విద్యార్థి విభాగ కమిటీలు ఏర్పాటు చేస్తామని తెలి పారు. విద్యార్థుల పట్ల కూటమి ప్రభుత్వం చేస్తున్న వ్యతిరేక విధానాలను జనాలలోకి తీసుకెళ్లి, రాజీలేని పోరాటాలు చేస్తామని తెలిపారు.

### టిడిపి నియోజకవర్గ ప్రోగ్రాం
## కోఆర్డినేటర్‌గా శంకర్ రెడ్డి



**బుచ్చినాయుడు కండ్రిగ, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూలై 06:** సత్యవేడు నియోజకవర్గం ప్రోగ్రామ్ కోర్డినేటర్గా నియమితులైన నెలవాయి శంకర్ రెడ్డిని ఆదివారం టిడిపి బృందం మర్యాద పూర్వకంగా కలిశారు. రాబోవు ఎన్నికలలో టిడిపికి కృషి చేసి విజయం వైపు తీసుకుని వెళ్లే బాధ్యత మాదేనని ఈ సందర్భంగా ఓటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలలోకి తీసుకొని వెళ్లే బాధ్యత ప్రతి ఒక్క టీడీపీ నాయకులు పై ఉందని, మన నాయకుడిని మరలా ముఖ్యమంత్రి స్థాయిలోకి తీసుకొని వెళ్లడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలనివారి ఈ కార్యక్రమంలో నెలవాయి టిడిపిఎంపీటీసీ మనోహర్ నాయుడు, మండల ఐటీడీపి కోఆర్డినేటర్ రమేష్, యూనిట్ ఇంచార్జ దామా మునేయ్య, పార్లపల్లి గ్రామ కమిటీ అధ్యక్షులు అదిశేసయ్య తదితరులు పాల్గొన్నారు.

## జన్ సురక్ష ఇన్సూరెన్స్ పై అవగాహన
### సున్నా ఖాతాలపై ప్రజల్లో చైతన్యం అవసరం: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు మేనేజర్ మీనా.

**వరదయ్యపాలెం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూలై 06:**



తిరుపతిజిల్లా వరదయ్యపాలెం మండలం, ఇందిరానగర్ పంచాయతీ పరిధిలోని పద్మావతిపురం కమ్యూనిటీ భవనంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో జన్ సురక్ష ఇన్సూరెన్స్ పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ మీనా మాట్లాడుతూ, జన్ సురక్ష బీమా, అటల్ పెన్షన్ యోజన, ప్రధాన్ మంత్రి జీవన్ జ్యోతి బీమా, (పీఎంఎస్బివై, పీఎం జెబివై,పీఎం ఏపివై )వంటి పథకాలు సామాన్య ప్రజలకు ఆర్థికరక్షణ కలిగిం చడమే లక్ష్యంగా ప్రభుత్వం తీసుకొచ్చినవని వివరించారు. గ్రామీణ ప్రజలు ఈ పథకాల సద్వినియోగం చేసుకుని భవి ష్యత్తుకు ఆర్థిక భద్రత ఏర్పరచుకోవాలని సూచించారు.సున్నా బ్యాంకు ఖాతాల ద్వారా ఈ పథకాలకు సులభంగానమోదు చేసుకోవచ్చని, ప్రతి ఒక్కరూ తమకు టుంబ భవిష్యత్ కోసం ఈ బీమా పథకాలను తప్పనిసరిగా ఎంచుకోవాలని వివరించారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ సిబ్బంది పవన్, గోపి, క్యాషియర్ సింధూర, మధుసూదన్ అహమద్ వలి చిన్న పాండూర్ సప్తగిరి గ్రామీణ బ్యాంక్ మేనేజర్, తేజ క్యాషి యర్, సతీష్, పద్మావ తిపురం గ్రామస్తులు సల్లా వీరభద్రయ్య, అక్బర్, పలువురు గ్రామస్తులు, మహిళా సంఘాల సభ్యులు, యువత పాల్గొన్నారు.

చిత్తూరు ఎక్స్‌ప్రెస్
APTEL/2024/86143 జాతీయ తెలుగు దినపత్రిక



# నీళ్ల విలువ తెలియని వ్యక్తులా మన నాయకులు

-మొదటిపేజీ తరువాయి

ఎమ్మెల్యే హరీష్ రావు తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. 'కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రతీరోజు ఏ నదిలో ఎంత నీరు ఉందో తెలుసుకునేవారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం వాటిని విస్మరిస్తోంది. నీళ్ల విలువ తెలియని నాయకులు మనకు పాలకులుగా ఉన్నారు. ఇప్పుడు నీరు వస్తున్నా వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. బటన్ నొక్కితే నీరు వచ్చే పరిస్థితి ఉన్నా ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారు?. కాళేశ్వరం మోట్లరు ఆన్ చేస్తే 15 జిల్లాలకు మేలు జరుగుతుంది. వెంటనే కాళ్లేశ్వరం మోటర్లు ఆన్ చేయండి. కాళేశ్వరం నీటితో రిజర్వాయర్లు నింపండి. లేదంటే లక్షలాది మంది రైతులతో కన్నెపల్లి వైపు కదులుతాం' అని హెచ్చరికలు జారీ చేశారు.



కాళేశ్వరానికి మాత్రమే NDSA వర్తిసుందా? SLBC కి NDSA వర్తించదా?. కాంగ్రెస్ పార్టీ చిల్లర రాజకీయాలకు ప్రాధాన్యత ఇస్తుంది. అన్నదాతకు అక్షయ పాత్ర కాళేశ్వరం. మేడిగడ్డతో సంబంధం లేకుండా గోదావరి నీళ్ళను ఎత్తి పోయేచ్చు. పాలమూరు బిడ్డ అయిన రేవంత్ రెడ్డి పాలమూరు ప్రజల నోరు కొడుతుండు. శ్రీశైలానికి వరద నీళ్లు వచ్చి 36 రోజుల అవుతుంది. కల్వకుర్తి మోటార్లు ఎందుకు ఆన్ చెయ్యడం లేదు. కల్వకుర్తి మోటార్లు ఇప్పటికైనా ఆన్ చేస్తరా, లేదంటే రైతులను ఆన్ చెయ్యమంటరా?. భీమా, కోయిల్ సాగర్ మోటార్లు ఆన్ చేయడంలో పూర్తిగా నిర్లక్యం చేశారు. గేట్లు ఎత్తలేని దద్దమ్మ ప్రభుత్వం ఈ కాంగ్రెస్. కృష్ణా జలాల వాడుకోవడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్యం చేస్తోంది. ఏపీకి నీళ్ళు ఇచ్చేందుకు రేవంత్ రెడ్డి చీకటి ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఇప్పటికైనా కన్నెపల్లి పంపు హౌస్ మోటార్లు ఆన్ చేసి సాగునీరు ఇవ్వాలని మేము డిమాండ్ చేస్తున్నాం అంటూ హెచ్చరించారు.

# సాదాబైనామా కొలిక్కి వచ్చేనా?

-మొదటిపేజీ తరువాయి

మధ్య ఇచ్చిన గడువులో 2.24 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. గడువును నవంబరు 10 వరకు పొడిగించగా 6.66 లక్షలు వచ్చాయి. మొత్తం 8.90 లక్షల మంది దరఖాస్తుదారులు దాదాపు 20 లక్షల ఎకరాల క్రమబద్ధీకరణకు ఎదురుచూస్తున్నారు.

**నిర్ణయానికి ఎదురుచూపు**

గత ప్రభుత్వ హయాంలో అందిన సాదాబైనామా దరఖాస్తులన్నీ రెవెన్యూశాఖకు చెందిన ఆన్‌లైన్‌లో ఉన్నాయా లేదా అనే సందేహాలు తలెత్తుతున్నాయి. కోర్టు ఆదేశాలకు అనుగుణంగా గతంలో ఒక దఫా దరఖాస్తుల పరిశీలన చేపట్టారు. అదే సమయంలో దరఖాస్తులేవీ పెండింగ్‌లో ఉండొద్దంటూ ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాలతో కొన్ని జిల్లాల కలెక్టర్లు ఎడాపెడా ఆన్‌లైన్‌లో తిరస్కరించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 22,509 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో 12,947 దరఖాస్తులను తిరస్కరించారు. మహబూబాబాద్‌లో 37,129కి 20,792. నిజామాబాద్‌లో 10,122కి 9,504. వనపర్తిలో 3,654కి 3,408. నల్గొండలో 14,409కి 14,166. సంగారెడ్డిలో 3,669కి 2,726 దరఖాస్తులను తిరస్కరించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 5,842 అందగా అన్నింటినీ తిరస్కరించారు. ప్రస్తుతం ఈ రైతుల్లో చాలా మంది తాజాగా నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తు చేసి ప్రభుత్వ నిర్ణయానికి ఎదురుచూస్తున్నారు.

**క్రమబద్ధీకరణ చేసేందుకు వీలు**

భూ దస్త్రాల యాజమాన్య హక్కుల చట్టం–ఆర్వోఆర్ 1971 సాదాబైనామాల క్రమబద్ధీకరణ చేసేందుకు వీలు కల్పిస్తోంది. 2020 అక్టోబరు 29న తెలంగాణ ప్రభుత్వం ఈ చట్టాన్ని రద్దు చేసింది. కొత్తగా 'తెలంగాణ పాసుపుస్తకాలు,



యాజమాన్య హక్కుల చట్టం'–ఆర్వోఆర్ 2020ను అమల్లోకి తెచ్చింది. సాదాబైనామాల క్రమబద్ధీకరణ చేయడం లేదంటూ కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఆర్వోఆర్ 2020లో సాదాబైనామాల క్రమబద్ధీకరణకు వీలు కల్పించే సెక్షన్లు ఏవీ లేవని న్యాయస్థానం పేర్కొంది.

కాగా ఆర్వోఆర్ 1971 చట్టం అమల్లో ఉన్న సమయంలో ప్రభుత్వానికి వచ్చిన దరఖాస్తులకు మాత్రమే అవకాశం కల్పించింది. దాని ప్రకారం 2020 అక్టోబరు 29కి ముందు అందిన 2.24 లక్షల దరఖాస్తుల క్రమబద్ధీకరణకు వీలు కల్పించింది. కానీ లక్షల్లో అర్జీలు రావడంతో చట్టసవరణ చేయడానికి వీలుగా ఆర్డినెన్స్ తీసుకురావాలని నాటి ప్రభుత్వం భావించింది. కాని అది కార్యాచరణలోకి రాలేదు. ఈ కేసు కోర్టులో కొనసాగుతూనే ఉంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక న్యాయపరమైన చిక్కులను తొలగించి సాదాబైనామాలకు అవకాశం కల్పించేందుకు అడుగులు వేసింది. కోర్టు నుంచి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా క్రమబద్ధీకరణ విషయంలో ముందుకు వెళ్లాలని రెవెన్యూ శాఖ నిర్ణయించింది.

# తెలంగాణ కల్చరల్ సొసైటీ 12వ సర్వ సభ్య సమావేశం

**తెలంగాణ కల్చరల్ సొసైటీ (సింగపూర్) :** పన్నెండవ వార్షిక సర్వ సభ్య సమావేశం జూన్ 29వ తేదీన స్థానిక ఆర్య సమాజం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో సుమారు 30 మందికిపైగా సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పదకొండవ సర్వసభ్య సమావేశపు వివరాలతో పాటు 2024–2025 ఆర్థిక సంవత్సరపు రాబడి, ఖర్చుల వివరాలను సభ్యులకు వివరించిన తరువాత పద్దులను ఉపాధ్యక్షులు భాస్కర్ గుప్త నల్ల ఆమోదించారు. ఈ సమావేశం సందర్భంగా సభ్యులు ముద్దం విజ్జేందర్ , గర్రెపల్లి శ్రీనివాస్, ఇతర సభ్యులు అడిగిన వివిధ ప్రశ్నలకు సొసైటీ అధ్యక్షులు గడప రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శి రాము బొందుగుల కోశాధికారి నంగునూరి వెంకట రమణ వివరణ ఇచ్చారు. ఈ సమావేశానికి మోడరేటర్‌గా ప్రధాన కార్యదర్శి రాము బొందుగుల వ్యవహరించారు. 2024–2025 ఆర్థిక సంవత్సరానికి గానూ పద్దుల తనిఖీ దారులుగా సేవలు అందించిన కైలాసపు కిరణ్, తెల్లదేవరపల్లి కిషన్ రావు గార్లకు కృతజ్ఞతలు తెలియజేశారు. సొసైటీ రాజ్యాంగానికి ప్రతిపాదించిన కొన్ని ముఖ్యమైన సవరణలకు సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలియజేశారు. 2025 నుంచి 2026 గాను పద్దుల తనిఖీ దారులుగా నీలం సుఖేందర్, కిరణ్ కుమార్ ఎర్రబోయిన గార్లను ప్రతిపాదించి ఎన్నుకోవడం జరిగింది. ఈ సమావేశంలో సభ్యులు ఇచ్చిన సలహాలన్నింటిని స్వీకరించి అమలు చేయుటకు సాయశక్తుల ప్రయత్నిస్తామని కార్యవర్గ సభ్యులు తెలిపారు. చివరిగా సర్వ సభ్యులందరూ సొసైటీ ఏర్పాటు చేసిన హై టీ ని ఆస్వాదించారు. ఈ సమావేశంలో అధ్యక్షులు గడప రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శి రాము బొందుగుల కోశాధికారి



నంగునూరి వెంకటరమణ, సొసైటీ ఉపాధ్యక్షులు బసిక ప్రశాంత్ రెడ్డి, దుర్గ ప్రసాద్, భాస్కర్ గుప్త నల్ల, జూలూరి సంతోష్ కుమార్ ఉపాధ్యక్షురాలు మిర్యాల సునీత రెడ్డి, సంస్థాగత కార్యదర్శి కాసర్ల శ్రీనివాస రావు, ప్రాంతీయ కార్యదర్శులు బొడ్ల రోజా రమణి, నడికట్ల భాస్కర్, శశిధర్ రెడ్డి, రవి కృష్ణ విజాపూర్,సంతోష్ వర్మ మాదారపు కార్యవర్గ సభ్యులు శివ ప్రసాద్ ఆవుల, పెరుకు శివ రామ్ ప్రసాద్, రవి చైతన్య మైసా, భాస్కర్ రావు పులిగిళ్ల, విజయ మోహన్ వెంగళ, ప్రవీణ్ మామిడాల, సతీష్ పెసరు, మణికంఠ రెడ్డి, రావుల సుగుణాకర్ రెడ్డి, చల్ల కృష్ణ గార్ల తోపాటు ఇతర జీవితకాల సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సొసైటీ వెన్నంటే ఉంటూ సహాయ సహకారాలు అందిస్తున్న ప్రతి ఒక్కరికి, సమావేశం సజావుగా సాగడానికి సహకరించిన సభ్యులందరికి పేరు పేరున ధన్యవాదాలు తెలిపారు.

# ఫాల్కన్ ఇన్వాయిస్ కేసు.. పంజాబ్‌లో సంస్థ సీవోవో అరెస్ట్

**హైదరాబాద్:** ఫాల్కన్ ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ కేసులో మరొకరు అరెస్టయ్యారు. ఆ సంస్థ సీవోవో ఆర్యన్‌సింగ్‌ను సీఐడీ అధికారులు పంజాబ్‌లోని భటిండాలో అరెస్ట్ చేశారు. ఈ కేసులో ఆర్యన్ సింగ్ ఏ5గా ఉన్నాడు. ఫాల్కన్ ఇన్వాయిస్ సంస్థ పెట్టుబడుల పేరిట ప్రజల నుంచి భారీగా డిపాజిట్లు సేకరించింది. మొత్తం 7,056 మంది నుంచి రూ. 4,215 కోట్లు స్వీకరించింది. మోసం బయటపడటంతో పోలీసు కేసు నమోదైంది. ఆ తర్వాత సీఐడీ దర్యాప్తు చేపట్టింది. ఇప్పటి వరకు ఈ కేసులో 9 మంది చిక్కారు. దేశవ్యాప్తంగా ఉన్నా హైదరాబాద్ కేంద్రంగానే నిందితులు ఫాల్కన్ ఇన్వాయిస్ మోసానికి తెరలేపారు. ఈ కేసులో సైబరాబాద్ ఈవోడబ్ల్యూ పోలీసులు 19 మంది పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. ప్రస్తుతం కేసును సీఐడీ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. బాధితుల నుంచి కొల్లగొట్టిన డబ్బును దాదాపు 20 డొల్ల కంపెనీలకు మళ్లించగా.. ఇందులో విదేశాలకు చెందిన సంస్థలు కూడా ఉన్నట్లు దర్యాప్తులో తేలింది.




# 9న చిత్తూరు జిల్లాకు వైఎస్ జగన్.. కూటమి సర్కార్‌లో అలజడి

**చిత్తూరు జిల్లా:** వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని చూస్తే సీఎం చంద్రబాబుకు వణుకుపుడుతోంది. వైఎస్ జగన్ ఈ నెల 9న బంగారుపాళెం మామిడి రైతులను పరామర్శించనున్న నేపథ్యంలో కూటమి ప్రభుత్వంలో అలజడి రేగుతోంది. చిత్తూరు జిల్లాలో మామిడి రైతులు కష్టాలు పడుతున్నారు. రైతులను జ్యూస్ ఫ్యాక్టరీలు దోచుకుంటున్నాయి. కిలో 3 నుంచి 4 రూపాయలకు కొనుగోలు చేస్తూ.. నిలువు దోపిడీ చేస్తున్నాయి. ఈ నెల 9న వైఎస్ జగన్ పర్యటన నేపథ్యంలో ప్రభుత్వంలో కదలిక వచ్చింది. కిలో ఆరు రూపాయలకు కొనేందుకు జైన్ జ్యూస్ ఫ్యాక్టరీ సిద్ధమైంది. వైఎస్సార్‌సీపీ హయాంలో కిలో 26 రూపాయలకు మామిడి అమ్మకాలు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మామిడి ధర తగ్గిపోయింది. జ్యూస్ ఫ్యాక్టరీలు వద్ద క్యూలైన్‌లో టోకెన్లు ఇచ్చి తక్కువ ధరకే దోచుకుంటున్నాయి. చాలా చోట్ల 3 నుంచి 4 రూపాయలకే జ్యూస్ ఫ్యాక్టరీలు దోచుకుంటున్నాయి.

వైఎస్ జగన్ పర్యటన ఇలా..

ఈనెల 9న వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బెంగళూరు నుంచి రోడ్డు మార్గంలో కోలారు, ముళబాగిళు, ఏపీ బోర్డర్ గంద్రాజుపల్లి, నాలుగు రోడ్లు, పలమనేరు బైపాస్ మీదుగా బంగారుపాళెంకు చేరుకుంటారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదల సొంతింటి కల సాకారం

-మొదటిపేజీ తరువాయి

పాలనలో పేదల కోసం ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని భట్టి విక్రమార్క విమర్శించారు. రైతుభరోసా కోసం కాంగ్రెస్ ప్రభుత్వం రూ.17,500 కోట్లు చెల్లించిదని చెప్పారు. రూ.లక్ష కోట్లతో డ్వాక్రా మహిళలకు రుణాలు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. అనంతరం మధిర పట్టణ ప్రగతిలో మరో కీలక మైలు రాయిగా నిలిచే రూ.6.45 కోట్లతో చేపట్టిన మధిరలోని అంబారుపేట పెద్ద చెరువు ట్యాంక్ బండ్ అభివృద్ధి పనులకు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు.

## రైతు భరోసా లేదు.. రైతు రుణమాఫీ లేదు

-మొదటిపేజీ తరువాయి

ఎందుకుందని కేటీఆర్ ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా 1.94 లక్షల మెట్రిక్ టన్నుల లోటు ఎందుకుందో రైతులకు వివరించాలని డిమాండ్ చేశారు. ?266.50 ఉండాల్సిన బస్తా యూరియా ధర ఇప్పుడు 325 ఎలా అయ్యిందో రైతులకే కాదు రాష్ట్ర ప్రజలకు మొత్తం తెలియాలన్నారు. ఈ బ్లాక్ మార్కెట్ దందాను దగ్గరుండి నడిపిస్తుంది ఎవరని ప్రశ్నించారు. ఈ కృత్రిమ కొరత ఎవరి వల్ల ఏర్పడుతుందో, ఆఖరికి ఎరువులను కూడా బుక్కేస్తున్న మేతన్నలు ఎవరో వెంటనే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

## సీఎం చంద్రబాబు 10న కొత్తచెరువు పర్యటన

-మొదటిపేజీ తరువాయి



పాల్గొనే అవకాశం ఉంది. సదరు ముఖ్యమంత్రి జిల్లా పర్యటనను విజయవంతం చేయడానికి జిల్లా అధికారులకు వివిధ బాధ్యతలను అప్పగించడం జరిగిందన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రణాళికా బద్దంగా పటిష్ట ఏర్పాట్లు చేయాలని విధులను కేటాయించిన అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలలో ఎస్.ఓ.పి. ప్రకారం అన్ని ఏర్పాట్లు చేయడంతో పాటు.. పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేయాలని సంభందిత అధికారులను ఆదేశించారు. ఆ మేరకు విధులను కేటాయించిన అధికారులందరూ అప్రమత్తంగా ఉంటూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు ప్రణాళిక బద్దంగా ఏర్పాట్లను పూర్తిచేసి విజయవంతం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

అనంతరం ఎస్పీ శ్రీమతి వి.రత్న మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా పోలీస్ శాఖ పరంగా చేపట్టే ప్రతిష్టమైన పందోబస్తు ఏర్పాట్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసు అధికారులకు తెలియజేశారు. అనంతరం జేసి అభిషేక్ కుమార్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ..లతో కలసి జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ జడ్పి బాలురు, బాలికల పాఠశాలలు, శ్రీ సత్య సాయి ప్రభుత్వ జూనియర్ కాలేజి..లలోని తరగతి గదులు, ప్రాంగణంలోని మైదానంను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు ఆదేశాలు, సూచనలు జారీచేశారు.

అంతకు ముందు వారు పుట్టపర్తి విమానాశ్రయంను పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో కె.ఆర్. ఆర్.సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి, పుట్టపర్తి, ధర్మవరం ఆర్డీవోలు సువర్ణ, మహేష్, డీఎస్పీ విజయ్ కుమార్,డీఆర్డీఏ పిడి నరసయ్య, సిపివో విజయకుమార్, డీఈవో కిష్టప్ప, జిఎస్ డబ్ల్యూ ఎస్ సుధాకర్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి వంశీకృష్ణ రెడ్డి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రాజు, డిపివో సమత, జిల్లా రవాణాధికారి శ్రీనివాస్, ఎస్ ఎస్ ఏ పీవో దేవరాజ్, తదితరులు పాల్గొన్నారు..

## ప్రతి మంగళవారం జాతరే!

జగిత్యాల జిల్లా: మంగళవారం వస్తే చాలు.. ఆ ఆలయంలో భక్తుల సందడి ఉంటుంది. ఆ రోజు జరిగే జాతరకు భక్తజనకోటి తరలి వస్తుంది. ఆ విశిష్ట ఆలయం మెట్‌పల్లి మండలం వెల్లుల గ్రామంలో ఉంది. ఇక్కడి ఎల్లమ్మ తల్లి ఆలయం వద్ద ప్రతి మంగళవారం జరిగే జాతరకు విశేషంగా భక్తులు తరలి వస్తున్నారు. గ్రామ శివారులో రహదారి పక్కనే చెట్టు రూపంలో ఉన్న ఈ ఆలయానికి.. ఇటీవలి కాలంలో భక్తుల తాకిడి పెరిగింది. ప్రతి మంగళవారం ఇక్కడ జాతర జరగడం విశేషం. ఇక్కడి ఎల్లమ్మకు ఎన్నో మహిమలు ఉన్నాయని భక్తులు విశ్వసిస్తుంటారు. ప్రతి వారం జరిగే జాతరకు చుట్టు పక్కల గ్రామాల నుంచే కాకుండా.. ఇతర జిల్లాలు, మహారాష్ట్ర నుంచి భక్తులు భారీగా తరలివస్తున్నారు.

**సుమారు 300 ఏళ్ల క్రితం..**

ఎక్కడైనా ఆలయంలో దేవుడు, దేవత ఉండడం.. భక్తులు పూజిస్తుండటం సహజం. కానీ ఇక్కడ చెట్టునే దైవంగా భావించి పూజలు చేస్తున్నారు. మెట్‌పల్లి మండలం వెల్లుల గ్రామ శివారులోని ఒక చెట్టు కింద.. సుమారు 300 ఏళ్ల క్రితం ఎల్లమ్మ తల్లి వెలసింది. ప్రసిద్ధిగాంచిన ఈ ఆలయం వద్ద ప్రతి మంగళవారం జాతర జరుగుతోంది. ప్రతి వారం జరిగే జాతర సందర్భంగా మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు భారీగా తరలి వస్తున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా వివిధ జిల్లాలు, మహారాష్ట్ర నుంచి తరలి వస్తున్నారు. అమ్మవారికి బెల్లం, పుట్నాలు, కల్లు సమర్పించి కోళ్లు, పొట్టేళ్లను బలిస్తున్నారు. కుటుంబ సమేతంగా వంటలు చేసుకొని సహపంక్తి భోజనం చేస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే జనాలతో ఈ ప్రాంతమంతా ప్రతి మంగళవారం సందడిగా మారుతుంది.

**బావినీటితో స్నానం ఆరోగ్యకరం**

ఎల్లమ్మ ఆలయానికి వచ్చే భక్తులు అక్కడి బావి నీటితో స్నానం చేస్తారు. ఈ బావిలోని నీటితో స్నానం చేస్తే చర్మవ్యాధులు తొలగిపోతాయని నమ్మకం. పురాతన కాలం నుంచి వస్తున్న ఈ ఆచారాన్ని ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్న తర్వాత.. తిరిగి ఇంటికి వెళ్లే సమయంలో భక్తులు బావిలోని నీటిని వెంట తీసుకెళ్తారు. పంటలు వేసే ముందు అమ్మవారిని దర్శించుకొని వెళ్తే బాగా పండుతాయని రైతులు నమ్ముతుంటారు.

## 9వ అఖిలభారత సమ్మెను జయప్రదం

**బుచ్చినాయుడు కండ్రిగ,చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూలై 06:**



ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధానకార్యదర్శ దాసరి జనార్ధన్ తొమ్మిదన తేదీన అఖిలభారత స్థాయిలో జరిగే సమ్మెను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవ సాయ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి దాసరి జనార్ధన్ పిలుపునిచ్చారు. ఆదివారం బుచ్చినాయుడు కండ్రిగ మండలం కుక్కంభాకం గ్రామంలో వ్యవసాయ కార్మికసంఘం గ్రామ కమిటీ సమావేశంజరిగింది. ఈ సందర్భంగా దాసరి జనార్ధన్, జిల్లా ఉపాధ్యక్షులు నలుగురి రమణయ్యలు మాట్లాడుతూ ఈనెల తొమ్మిదవ తేదీన అఖిలభారత స్థాయిలో కార్మిక సంఘాలు తలపెట్టిన సమ్మెలో వ్యవసాయ కార్మికసంఘంకూడా మద్దతు తెలియ జేస్తూ ఉపాధిహామీచట్టం ద్వారా కూలీలకు సంవత్సరానికి 200 రోజులు పని దినాలు కల్పించి, రోజుకు 600 రూపాయల వేతనం కల్పించాలని, బడ్జెట్లో నిధులు పెంచాలని, రైతులకు గిట్టుబాటు ధరకుచట్టం చేయాలని, కార్మిక చట్టాలను రద్దు చేయకుండా పాత పద్ధతిలో కొనసాగించాలని,నాలుగు లేబర్ కోడ్ల ను రద్దుచేయాలని,కౌలు రైతులకు గుర్తిం పు కార్డులు ఇవ్వాలని,రైతులకు రుణ మాఫీ చేయాలని, అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు సంవత్సరానికి ?20,000 తక్షణమే రిలీజ్ చేయాలని తదితర డిమాండ్లతో జరుగుతున్న సమ్మెలో వ్యవసాయ కూలీలు, రైతులు కార్మికులు, పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కుక్కంభాకం గ్రామ కమిటీ అధ్యక్షులు జేకే రమ ణయ్య ప్రధానకార్యదర్శి కృష్ణమ్మ కార్యవర్గసభ్యులు సుజాత మల్లేశ్వరి మునెమ్మయ్య సుబ్ర హ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లోనే విదేశీ మేలిమి గ్రానైట్

ఇంటి అందం ద్విగుణీకృతం చేయడానికి.. కొందరు గృహ యజమానులు ఖర్చుకు వెనకాడట్లేదు. ఇంటి అలంకరణలో తమదైన ప్రత్యేక ముద్ర ఉండాలని కోరుకుంటున్నారు. ఇలాంటి వారికోసమే ప్రపంచంలో అరుదుగా దొరికే గ్రానైట్లు బోలెడు ఉన్నాయి. వీటిని ఎంచుకోవడానికి ఏ అమెరికాకో ఆఫ్రికాకో వెళ్లక్కర్లేదు. ఎంచక్కా మన నగరంలోనే ఇవి లభిస్తున్నాయి. చిత్రకారుడి కుంచె నుంచి జాలువారిన చిత్రంలా దర్శనమిచ్చే గ్రానైట్ రకాలకు ప్రపంచ మార్కెట్లో ఎక్కడ్లేని గిరాకీ పెరుగుతోంది. వీటికోసం చదరపు అడుగుకి రూ.2,500 దాకా పెట్టాల్సి ఉంటుంది. వీటిని గోడలకు అమరిస్తే.. అచ్చం చిత్రకారుడు వేసిన బొమ్మల మాదిరిగానే కనిపిస్తాయి. యూరప్, అమెరికా, సౌదీ అరేబియా, ఆఫ్రికా, అంగోలా, నమీబియా, మడగాస్కర్, నార్వే, ఫ్లిన్లాండ్, బ్రెజిల్, ఐస్‌ల్యాండ్ వంటి దేశాలకు చెందిన గ్రానైట్‌కు ప్రపంచ మార్కెట్లో ఎక్కడ్లేని గిరాకీ ఉంది. మరి ఇవి విదేశాల నుంచి ఇక్కడికి ఎలా చేరుకుంటాయనేది మీ సందేహమా? ఆయా దేశాల నుంచి ఇవన్నీ నౌకలో ముంబైకి దిగుమతి అవుతాయి. అక్కడి నుంచి రైలు మార్గంలో నగరానికి.. లారీల ద్వారా సిటీ చుట్టుపక్కల ఉన్న గ్రానైట్ పరిశ్రమలకు చేరుకుంటాయి.

**ఒక్కో గ్రానైట్..**

ఒక్కో గ్రానైట్ బ్లాకు 25 నుంచి 35 టన్నుల దాకా ఉంటుంది. మొదట్లో కాస్త ఎత్తుపల్లాలుగా ఉన్న గ్రానైట్‌ను.. బడా యంత్రాల సాయంతో డ్రెస్సింగ్ చేస్తారు. పాలిష్ చేసి



ఎగుడుదిగుడు లేకుండా చేస్తారన్నమాట. ఆ తర్వాత స్టీల్ గ్రిట్ బ్లేడ్లతో కత్తిరించి డైమండ్ బ్రిక్సతో పాలిష్ చేస్తారు. బ్రెడ్డును ముక్కలుగా కోసినట్లే.. భారీ ఆకారం గల గ్రానైట్ బ్లాకును కోస్తారన్నమాట. ఈ ప్రక్రియ తర్వాత ఒక్కో ముక్కను వేడి చేసే ఓవెన్‌లో పెడతారు. ఫలితంగా గ్రానైట్‌లో ఉన్న నీరంతా ఆవిరవుతుంది. ఆ తర్వాత రెసిన్ పెడతారు. దీని వల్ల భవిష్యత్తులో గ్రానైట్ నీరు పీల్చుకోకుండా ఉంటుంది. తర్వాత ప్రక్రియ క్యూరింగే.. ఇదయ్యాక పాలిష్ అవ్వగానే గ్రానైట్ తళతళ మెరుస్తుంది. మొత్తం ఏడు రోజులు జరిగే ఈ ప్రక్రియ పూర్తయ్యాక.. గ్రానైట్ ప్రపంచ దేశాలకు ఎగుమతికి సిద్ధమవుతుంది.

**ఇంటికే ప్రత్యేకం..**

దాదాపు ఎనభై రంగులు గల గ్రానైట్.. వివిధ దేశాల నుంచి హైదరాబాద్‌కు దిగుమతి అవుతోంది. సౌదీ అరేబియాకు చెందిన 'ట్రాపిక్ బ్రౌన్' ధర చ.అ.కు 300 దాకా ఉంటుంది. అదే నార్వే 'బ్లూ పెరల్' రేటు రూ.500 వరకూ పలుకుతుంది. ఇక ఫిన్‌లాండ్ 'బాల్టిక్ బ్రౌన్' ధర కూడా ఇంచుమించు రూ.300లు ఉంటుంది. ఇవి కాకుండా ఖరీదైన రకాలు బోలెడున్నాయి.

**మేలిమి గ్రానైట్..**

యూరప్ ఐస్‌లాండ్‌ల మధ్య.. అక్కడక్కడా విసిరేసినట్లు కనిపించే చిన్న చిన్న దీవుల్లో మేలిమి రకమైన గ్రానైట్ లభిస్తోంది. యూరప్ నుంచి అక్కడికి వెళ్లడానికే కనీసం మూడు రోజులైనా పడుతుందని నిపుణులు చెబుతున్నారు. 'బ్లాక్ బ్యూటీ' గ్రానైట్ కోసం చదరపు అడుగుకి రూ.2 వేల దాకా పెట్టాల్సి ఉంటుంది. బ్రెజిల్‌లో దొరికే 'అమెజాన్' రకం ధర.. చదరపు అడుగుకి రూ.1,600 ఉంటుంది. ఇదే రకాన్ని మీ ఇంట్లో వేయాలనుకుంటే మీకయ్యేది సుమారు వెయ్యి రూపాయలే. అదెలా అంటారా? మీకేం కావాలో గ్రానైట్ సంస్థలకు చెబితే వాటిని చిన్నచిన్న బ్లాకులుగా తీసుకొచ్చి అందజేస్తారు. కాకపోతే ఆర్డర్ ఇచ్చిన మూడు నెలల తర్వాతే ఇవి ఇంటికి చేరుతాయి. కాబట్టి, ఇంటి నిర్మాణం నాటి నుంచే గ్రానైట్‌కు సంబంధించి అవగాహనకు రావడం ఉత్తమం.

# ఒక్కరోజే రూ.735 కోట్ల లాభం

భారతీయ మార్కెట్లలో జేన్ స్ట్రీట్ అక్రమాలు అన్నీఇన్నీ కావు

**న్యూఢిల్లీ/ముంబై, జూలై 5:** భారతీయ మార్కెట్లలో అమెరికాకు చెందిన ప్రొప్రైటరీ ట్రేడింగ్ సంస్థ జేన్ స్ట్రీట్ గ్రూప్ పాల్పడిన అక్రమాలు సంచలనం సృష్టిస్తున్నాయి. ఇప్పటికే క్యాపిటల్ మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ.. జేన్ స్ట్రీట్‌పై నిషేధం విధించిన విషయం తెలిసిందే. ఎస్క్రో ఖాతాలో అక్రమంగా ఆర్జించిన రూ.4,843 కోట్ల లాభాలను డిపాజిట్ చేయాలని కూడా ఆ కంపెనీని సెబీ ఆదేశించిన సంగతీ విదితమే. అయితే ఓ సంస్థకు ఈ స్థాయిలో జరిమానా పడటం సెబీ చరిత్రలోనే ఇది తొలిసారి. ఇక సెబీ బయటపెడుతున్న వివరాల్లో జేన్ స్ట్రీట్ ఎలా వేల కోట్ల రూపాయలను ఆర్జించిందో తెలియవస్తుంటే.. మన వ్యవస్థలో సరిదిద్దాల్సిన లోపాలు ఎన్నున్నాయో అర్థమవుతున్నదిప్పుడు. గత ఏడాది జనవరిలో ఓ రోజైతే ఏకంగా రూ.735 కోట్ల లాభాన్ని జేన్ స్ట్రీట్ జేబులో వేసుకున్నది మరి.

**ఇదీ సంగతి..**

2024 జనవరి 17న జేన్ స్ట్రీట్.. బ్యాంక్ నిఫ్టీ ఇండెక్స్, దాని కంపోనెంట్స్‌లో మునుపెన్నడూ లేనివిధంగా ఓ సరికొత్త 'ఇంట్రా-డే ఇండెక్స్ మ్యానిపులేషన్' స్కీంను తెచ్చి ఇండెక్స్ ఆప్షన్స్ నుంచి పెద్ద ఎత్తున లాభాలను గడించిందని సెబీ దర్యాప్తులో తేలింది. నాడు బ్యాంక్ నిఫ్టీ ఇండెక్స్ 46,573.95 వద్ద ముగిసింది. మునుపటి రోజు (జనవరి 16) ముగింపు (48,125.10)తో పోల్చితే నష్టాలను చవిచూసింది. అయితే ఇందుకు కారణం అంతా 16న మార్కెట్ ట్రేడింగ్ ముగిసిన తర్వాత హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రకటించిన ఆర్థిక ఫలితాలు నిరాశపర్చడమే అనుకున్నారు. కానీ దీని వెనుక జేన్ స్ట్రీట్ అనుసరించిన రెండు దశల వ్యూహాలున్నాయని, అందువల్లే 17న కొద్ది గంటల ట్రేడింగ్‌లోనే అది రూ.734.93 కోట్ల నికర లాభాలను పొందినట్టు సెబీ గుర్తించింది. నాడు ఉదయాన్నే క్యాష్/ఫ్యూచర్స్ మార్కెట్లలో బ్యాంక్ నిఫ్టీ ఇండెక్స్‌లోని రూ.4,370 కోట్ల విలువైన స్టాక్స్‌ను జేన్ స్ట్రీట్ కొన్నది. ఈ పరిణామం సూచీలో కృత్రిమ పెరుగుదలకు దారితీసింది. దీంతో అప్పటిదాకా నష్టాల్లో కదలాడుతున్న మార్కెట్.. రికవరీ అవుతున్నదన్న తప్పుడు సంకేతాలు మదుపరులలోకి వెళ్లాయి. ఇదే సమయంలో చౌకగా కొనుగోలు ఆప్షన్స్‌ను, ఖరీదైనవిగా అమ్మకపు ఆప్షన్లను పెట్టడం ద్వారా బడా బ్యాంకుల షేర్లుండే నిఫ్టీ బ్యాంక్ ఇండెక్స్ ఆప్షన్స్‌లో రూ.32,114.96 కోట్ల బేరిష్ పొజీషన్లను జేన్ స్ట్రీట్ ప్రభావవంతంగా నిర్మించగలిగింది. అయితే ఆ తర్వాత కాసేపటికే తమవద్ద ఉన్న దాదాపు అన్ని స్టాక్స్‌ను జేన్ స్ట్రీట్ అమ్మేసింది. దీంతో పెద్ద ఎత్తున జరిగిన అమ్మకాలు.. కంపోనెంట్ స్టాక్స్, ఇండెక్స్‌లో ధరల పతనానికి దారితీసింది. సూచీ పడిపోయింది. ఈ సమయంలో జేన్ స్ట్రీట్ గ్రూప్ సైతం ఇంట్రా-డే క్యాష్/ఫ్యూచర్స్ మార్కెట్ ట్రేడింగ్‌లో నష్టాలను అందుకున్నది. అయినప్పటికీ ఇండెక్స్ ఆప్షన్స్ నుంచి వచ్చిన లాభాలు ఈ నష్టాల కంటే చాలాచాలా ఎక్కువని సెబీ చెప్తున్నది. ఇలా 2023 జనవరి నుంచి 2025 మే వరకు దేశంలోని వివిధ మార్కెట్ సెగ్మెంట్లలో




మొత్తం రూ.36,671 కోట్ల నికర లాభాలను జేన్ స్ట్రీట్ అందుకోవడం గమనార్హం.

**ఐఐటీ విద్యార్థికి రూ.4.3 కోట్ల జీతం**

భారతీయ డెరివేటివ్స్ మార్కెట్‌లో అధునాతన అల్గారిథమిక్ ట్రేడింగ్ ద్వారా పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడిన జేన్ స్ట్రీట్ సంస్థ.. ఓ ఐఐటీ మద్రాస్ విద్యార్థికి ఏకంగా రూ.4.3 కోట్ల వార్షిక వేతనాన్ని ఆఫర్ చేయడం ఇప్పుడు మిక్కిలి ప్రాధాన్యతను సంతరించుకుంటున్నది. గత ఏడాది డిసెంబర్‌లో జరిగిన ఐఐటీ మద్రాస్ ప్లేస్‌మెంట్ సీజన్‌లోనే ఇది అత్యధికం కావడం గమనార్హం. అయితే మ్యాథమెటిక్స్, ప్రోగ్రామింగ్, రియల్-టైం డెసిషన్-మేకింగ్‌లో అడ్వాన్స్‌డ్ నైపుణ్యాలున్నవారికి ఆ కంపెనీ ఎందుకింత పెద్దపీట వేస్తున్నదనడానికి కూడా ఈ ఆఫర్ అద్దం పడుతున్నదిప్పుడు. ఎంఐటీ, హార్వర్డ్, కేంబ్రిడ్జ్, ఆక్స్‌ఫర్డ్, స్టాన్‌ఫర్డ్, ప్రిన్స్‌టన్ వంటి అంతర్జాతీయ ప్రముఖ యూనివర్సిటీల నుంచి ఎక్కువగా జేన్ స్ట్రీట్ నియామకాలు చేపడుతున్నది. భారత్‌లోనైతే ఐఐటీల నుంచి ఉద్యోగులను తీసుకుంటున్నది. ఇక సాధారణంగా జేన్ స్ట్రీట్ ఇంటర్వ్యూ ప్రక్రియ క్వాంటిటేటివ్ సమస్యల పరిష్కారం, కోడింగ్ సవాళ్లు, చురుకుదనం తదితర అంశాలపై ఆధారపడి ఉంటుంది.

**సెబీకి సహకరిస్తాం: జేన్ స్ట్రీట్**

తాజా పరిణామాలపై జేన్ స్ట్రీట్ స్పందించింది. ప్రపంచవ్యాప్తంగా తాము అనేక దేశాల్లో ట్రేడింగ్ కార్యకలాపాలను నిర్వర్తిస్తున్నామని, అక్కడి రెగ్యులేటర్ల నిబంధనల్ని పాటిస్తున్నామని జేన్ స్ట్రీట్ రాయిటర్స్‌కు ఓ ఈ-మెయిల్ ద్వారా బదులిచ్చింది. ఈ సమస్య పరిష్కారానికి సెబీతో ప్రయత్నిస్తున్నామని కూడా చెప్పుకొచ్చింది. అయితే ఈ వ్యవహారంపై సెబీ దర్యాప్తు ఇంకా కొనసాగుతున్నది. ఈ క్రమంలోనే భారతీయ సెక్యూరిటీస్ మార్కెట్లలో ప్రత్యక్షంగానైనా, పరోక్షంగానైనా ఎలాంటి క్రయవిక్రయాలకు దిగరాదంటూ జేన్ స్ట్రీట్‌పై నిషేధం విధించింది. 2000వ సంవత్సరంలో ఏర్పాటైన జేన్ స్ట్రీట్.. ప్రస్తుతం ప్రపంచంలోని అతిపెద్ద ప్రొప్రైటరీ ట్రేడింగ్ సంస్థల్లో ఒకటిగా ఉన్నది. ఈక్విటీలు, ఈటీఎఫ్‌లు, బాండ్లు, ఆప్షన్స్, క్రిప్టో ఇలా అనేక ఆస్తుల్లో ఏటా 17 ట్రిలియన్ డాలర్లకుపైగా ట్రేడింగ్‌ను చేస్తున్నది.

## ఒలింపిక్స్ ఆతిథ్యంపై అనిశ్చితి..
## వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్ హక్కులకు సిద్ధమవుతున్న భారత్!

ఒలింపిక్స్ హక్కుల కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్న భారత్ మరో మెగా టోర్నీ నిర్వహణ దిశగా పావులు కదుపుతోంది. 2036 విశ్వక్రీడల హక్కుల కోసం ప్రయత్నిస్తూనే.. మరోవైపు ప్రతిష్టాత్మక వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్ ఆతిథ్యానికి ఇండియా సిద్ధమవుతోంది. రెండేళ్లకోసారి జరిగే ఈ మెగా క్రీడా పండుగకు హోస్ట్‌గా ఉండాలనే ఉద్దేశంతో 2029, 2031 ఎడిషన్లకు బిడ్డింగ్ వేయనుంది భారత్. వచ్చే ఏడాది సెప్టెంబర్‌లో లో ఆతిథ్యమిచ్చే దేశాల పేర్లను ప్రపంచ అథ్లెటిక్ సమాఖ్య ఖరారు చేయనుంది. ఈ నేపథ్యంలోనే భారత బృందం రెండింటో ఒక్కటోర్నీ రైట్స్ అయినా సాధించేందుకు శతవిధాలా ప్రయత్నిస్తోంది. ఈ విషయాన్ని ఆదివారం జాతీయ అథ్లెటిక్ సమాఖ్య అధికార ప్రతినిధి అదిల్లె సుమరివిల్లా ధ్రువీకరించాడు. వరల్డ్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడిగా పనిచేసిన అదిల్లె బెంగళూరులో జూన్ 5 న జరిగిన నీరజ్ చోప్రా క్లాసిక్ తొలి సీజన్ ప్రారంభోత్సవానికి విచ్చేశాడు. ఈ సందర్భంగా ఆయన భారత్‌లో వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్ నిర్వహణ సాధ్యాసాధ్యాలపై స్పందించాడు. 'వరల్డ్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్స్ పోటీలకు ఆతిథ్యం ఇవ్వాలనుకుంటున్నాం. అందుకే.. 2029, 2031 ఎడిషన్లకు బిడ్డింగ్ వేయాలనుకుంటున్నాం. అయితే.. తదుపరి హోస్ట్ ఎంపిక ప్రక్రియ మొదలవ్వడానికి ఇంకా సమయం ఉంది. కాబట్టి మేము పక్కాగా హోస్టింగ్ రైట్స్ కోసం ప్రయత్నిస్తాం. హక్కులు దక్కించుకున్న దేశాల పేర్లను 2026 సెప్టెంబర్‌లో డబ్ల్యూఏఎఫ్ వెల్లడిస్తుంది. సో.. మాకు ఈ రెండిటిలో ఏదో ఒక టోర్నీ ఆతిథ్యానికి ఆమోదం




లభించినా సంతోషమే. మరో విషయం.. మేము ఇప్పటికే జూనియర్ వరల్డ్ ఛాంపియన్‌షిప్స్ 2028 రైట్స్ కోసం అవసరమైన అన్ని పత్రాలు సమర్పించాం' అని అదిల్లె వివరించాడు. తన పేరుతో నిర్వహించిన 'ఎన్‌సీ క్లాసిక్' టోర్నీలో నీరజ్ చోప్రా ఛాంపియన్‌గా అవతరించాడు. ఫైనల్లో అతడు ఈటెను 86.18 మీటర్ల దూరం విసిరాడు. కెన్యా అథ్లెట్ జులియస్ యెగొ 84.51 మీటర్లతో రెండో స్థానంలో నిలవగా, రుమెశ్ పథిరగె (శ్రీలంక) 84.34 మీటర్ల దూరంతో మూడో స్థానం దక్కించుకున్నాడు.

## వీరాభిమానికి బహుమతిగా బ్యాట్..
## పొంగిపోయిన చిన్నారి..!



సుదీర్ఘ ఫార్మాట్‌లో పరుగుల ప్రవాహం కొనసాగిస్తూ.. రికార్డులు బద్దలు కొడుతున్నాడు భారత యువ ఓపెనర్ యశస్వీ జైస్వాల్ నిరుడు వెస్టిండీస్ పర్యటనతో టీమిండియా స్టార్‌గా అవతరించిన యశస్వీ ఇంగ్లండ్ గడ్డ మీద కూడా చెలరేగుతున్నాడు. తన విధ్వంసక ఆటతో ఈతరం కుర్రాళ్లకు స్ఫూర్తిగా నిలుస్తున్న ఈ చిచ్చరపిడుగు ఇంగ్లండ్ గడ్డ మీద వీరాభిమానిని కలిశాడు. అతడి పేరు రవి దృష్టిలోపంతో బాధపడుతున్న ఆ చిన్నారి ఎడ్జ్‌బాస్టన్‌కు వచ్చాడని తెలిసి.. స్వయంగా వెళ్లి పలకరించాడీ ఓపెనర్. అంతేకాదు అతడికి ప్రత్యేక బహుమతి అందించాడు. 'హలో రవి. ఎలా ఉన్నావు? నా పేరు యశస్వీ. నిన్ను కలిసినందుకు చాలా సంతోషంగా ఉంది. నువ్వు క్రికెట్‌ను ఎంతో ఇష్టపడతావని తెలిసి నేను చాలా థ్రిల్ అయ్యాను. నేను నీకో బహుమతి తీసుకొచ్చాను. ఇది నా బ్యాట్. దీన్ని నా జ్ఞాపకంగా నీ వద్ద ఉంచుకోవాలని కోరుతున్నా. నిన్ను కలవడం.. నీతో మాట్లాడడం చాలా ఆనందాన్ని ఇస్తోంది. నిన్ను ఇక్కడ చూసినందుకు సో హ్యాపీ' అని యశస్వీ అన్నాడు. తన అభిమాన ఆటగాడు తనతో మాట్లాడడంతో ఉబ్బితబ్బిబ్బైన రవి సంతోషం పట్టలేకపోయాడు. 'నిన్ను కలిసినందుకు నేను కూడా హ్యాపీ. నువ్వు భారత స్టార్‌వి. నాకు క్రికెట్ అంటే ఇష్టం. నీ బ్యాటింగ్ చూస్తా. నువ్వు సెంచరీ కొట్టిన ప్రతిసారి నేను ఎంతో ఎంజాయ్ చేశాను' అని యశస్వీతో రవి అన్నాడు. చూపు సరిగ్గా లేకున్నా సరే క్రికెట్‌పై అతడికున్న మక్కువ, ఆటపై అతడికున్న పరిజ్ఞానం చూసి జైస్వాల్ ఫిదా అయ్యాడు. యశస్వీ %-% రవితో సంభాషిస్తున్న వీడియోను బీసీసీఐ షేర్ చేయగా నెట్టింట వైరలవుతోంది.

**స్పోర్ట్స్**

## గుడ్ న్యూస్..
## ఆట మొదలైంది..




ఎడ్జ్‌బాస్టన్ నుంచి టీమిండియా అభిమానులకు గుడ్ న్యూస్ తెలుస్తుంది. చివరి రోజు ఆట ప్రారంభానికి ముందు ఆటంకం కలిగించిన వరుణుడు ప్రస్తుతం శాంతించాడు. వర్షం పూర్తిగా తగ్గుముఖం పట్టడంతో మైదానంలో కప్పి ఉంచిన కవర్లను తొలగించారు. ఔట్ ఫీల్డ్‌ను వేగంగా డ్రై చేశారు. సూర్యుడు మేఘాలను ముసుగు నుంచి బయటికి వచ్చాడు. అయితే ఓవర్ల కోత మాత్రం తప్పలేదు. ఇవాళ్టి ఆటలో 90 కాకుండా 80 ఓవర్లకు మాత్రమే అవకాశం ఉంటుంది. వర్షం కారణంగా 10 ఓవర్ల కోత పడింది. భారతకాలమానం ప్రకారం మధ్యాహ్నం 3:30 గంటలకు ప్రారంభం కావాల్సిన మ్యాచ్.. దాదాపు 2 గంటలు ఆలస్యంగా భారతకాలమానం ప్రకారం సాయంత్రం 5:10 గంటలకు ప్రారంభమయ్యింది. సవరించిన సెషన్ టైమింగ్స్‌ను కూడా అంపైర్లు ప్రకటించారు. తొలి సెషన్ 5:10 నుంచి 7 గంటల వరకు.. రెండో సెషన్ 7:40 నుంచి 9:40 వరకు.. మూడో సెషన్ రాత్రి 10 గంటల నుంచి 11:30 గంటల వరకు జరగనుంది. కాగా, ఈ మ్యాచ్‌లో భారత్ చారిత్రక గెలుపుకు 7 వికెట్ల దూరంలో ఉంది. ఇంగ్లండ్.. భారత్ నిర్దేశించిన 608 పరుగుల లక్ష్యాన్ని ఛేదిస్తూ నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 3 వికెట్లు కోల్పోయి 72 పరుగులు చేసింది. నాలుగో రోజు ఆటలో టీమిండియా 427/6 వద్ద రెండో ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. శుభ్‌మన్ గిల్ (162 బాల్స్‌లో 13 ఫోర్లు, 8 సిక్సర్లతో 161) సెంచరీతో చెలరేగగా.. రవీంద్ర జడేజా (69 నాటౌట్), రిషబ్ పంత్ (65), కేఎల్ రాహుల్ (55) హాఫ్ సెంచరీలతో రాణించారు. మరోవైపు టీమిండియా ఎడ్జ్‌బాస్టన్‌లో ఇప్పటివరకు ఒక్క మ్యాచ్ కూడా గెలవలేదు. ఈ మ్యాచ్‌లో గెలిచి చరిత్ర సృష్టించాలని టీమిండియా ఆటగాళ్లు ఆరాటపడుతున్నారు.

స్కోర్ వివరాలు..

భారత్ 587 %ం% 427/6 డిక్లేర్

ఇంగ్లండ్ 407 %ం% 72/3 (16) ప్రస్తుత రన్‌రేట్: 4.5

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh.
Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143